క్లుప్తంగా

అభివృద్ధి సేవా కమిటీ ఎన్నిక



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో మహమ్మదీయ ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ హాల్, షాదీ ఖానా అభివృద్ధి సేవా కమిటీ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా నూర్ భాష హుస్సేన్, ఉపాధ్యక్షులుగా పఠాన్ మస్తాన్‌వలి, సెక్రటరీగా షేక్ రజాక్, జాయింట్ సెక్రటరీగా షేక్ జానీ, ట్రెజరర్‌గా షేక్ మీర్‌సా సాహెబ్ సహా 15 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. అదే విధంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం దానం చేసిన దివంగత నూతలపాటి పరమేశ్వరరావు కుమారుడు నూతలపాటి త్రిలోక్‌ను గౌరవ సలహాదారుడిగా ఎన్నుకున్నామని సభ్యులు తెలిపారు.

రోటరీ ద్వారా సమాజ సేవ



ప్రత్తిపాడు: రోటరీ క్లబ్ ద్వారా విస్తృతంగా సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించవచ్చని రోటరీ సెంటినియల్ గవర్నర్ జాష్టి రంగారావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ పెదనందిపాడు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని ఎస్ఆర్ఎస్ రెయిన్‌బో పాఠశాలలో ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. పెదనందిపాడు రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడు చిన్నం శ్రీనివాసరావు, సెక్రటరీ పోపూరి నాగేశ్వరరావు, ట్రెజరర్ కోడూరి నాగేశ్వరరావుతో పాటు ఆఫీస్ బేరర్లతో రోటరీ గవర్నర్ నామినీ హరిహర ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన జాష్టి రంగారావు సభ్యులకు అభినందనలు తెలిపారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు చిన్నం శ్రీనివాసరావు, పోపూరి నాగేశ్వరరావులు మాట్లాడుతూ.. క్లబ్ ద్వారా ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ పోలిశెట్టి రాఘవయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమొక్రటిక స్టేట్ ప్రెసిడెంట్ గొల్లపూడి మోహన్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే ప్రతిఘటించండి

పెదకాకాని: ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే ప్రతిఘటించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన పెదకాకాని సుందరయ్య కాలనీలో స్మార్ట్ మీటర్ల వినియోగంపై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామారావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు కరెంటు ఛార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత సర్దుబాటు, ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలకు మోయలేని భారాన్ని వేస్తుందన్నారు. కార్యక్రమానికి మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నంబూరు శాఖ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, పెదకాకాని శాఖ కార్యదర్శి బి.బాబురావు, బురదగుంట సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై కక్ష సాధింపు తగదు

లక్ష్మీపురం: శాంతియుతంగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం తగదని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు పేర్కొన్నారు. స్థానిక సీఐటీయు కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌కు 2025 జూన్ 12న సమ్మె నోటీసు ఇచ్చామని వివరించారు. చట్ట ప్రకారం సమ్మె నోటీసు ఇచ్చి సమ్మె చేస్తున్న కార్మికులను భయభ్రాంతులకు గురిచేసేందుకు నగరపాలక సంస్థ కమిషనర్ షోకాజు నోటీసులు ఇవ్వటం సరైన చర్య కాదన్నారు. షోకాజ్ నోటీసులు వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: వయో వృద్ధులు, దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా సహాయం అందించాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల రెండో ఆదివారంలో భాగంగా వయో వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో కూలీ పనులు చేయలేక ఎందరో అర్ధాకలితో జీవిస్తున్నారని అన్నారు. అటువంటి వారికి తమ వంతుగా చేయూతను అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉచిత బియ్యం కమిటీ చైర్మన్ పాలేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎస్వీ రమణ, పల్లంపాటిర జనీశ్వరరావు, పలకలూరి శివరావు, మామిడి వెంకటశ్రావణ్ పాల్గొన్నారు.

అప్రకటిత కోతలు.. వినియోగదారుల వెతలు!

- రోజులో పలుమార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం
- కొరవడిన పర్యవేక్షణ



నిడుబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్

పొన్నూరు: విద్యుత్ బిల్లులను ముక్కుపిండి వసూలు చేసే అధికార యంత్రాంగం వినియోగదారులకు నాణ్యమైన సరఫరా అందించడంలో ఘోరంగా వైఫల్యం చెందుతోంది. నియోజకవర్గ కేంద్రమైన పొన్నూరులో చినుకుపడినా.. గాలివీచినా.. బ్రేక్ డౌన్ అంటూ. సాంకేతిక సమస్యలను సాకుగా చూపి ఎడాపెడా విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తున్నారు. అధికారుల అలసత్వం, సిబ్బంది నిర్లక్ష్యంతో ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షం, గాలి వస్తే చాలు సరఫరాకు అంతరాయం ఏర్పడడం ఆనవాయితీగా మారింది. విద్యుత్ సరఫరా ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలియడం లేదు. స్తంభాలకు వేలాడుతున్న తీగలు ఎండకు ఎండి వానకు తడుస్తున్నాయి. అధిక ఎండలకు తోడు డిమాండ్ పెరిగినప్పుడు విద్యుత్ లైన్లపై అధిక భారం పడుతోంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

పట్టణంలో 31 వార్డులలో సుమారు 70 వేల మంది జనాభా ఉన్నారు. పట్టణ పరిధిలో 7 మంది అసిస్టెంట్ లైన్‌మెన్‌లు పని చేయాల్సి ఉండగా.. ముగ్గురు మాత్రమే ఉన్నారు. మిగిలిన నలుగురి సిబ్బంది కొరతగా ఉండడంతో కోతల సమస్య ప్రజలను పీడిస్తోంది. దీంతో సకాలంలో విద్యుత్ సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు కరెంటు కోతలతో అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ అంతరాయం ఏర్పడినా అధిగమించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఉన్న సిబ్బందితోనే సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. సిబ్బంది సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– శంకర్, విద్యుత్ ఏఈ, పొన్నూరు

చిన్న చిన్న అంతరాయాలకు..

గాలివీచినా.. చెట్ల కొమ్మలు విరిగిపడినా.. వాన కురిసినా విద్యుత్ సరఫరాకు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక రాత్రి వేళల్లో ప్రజలు పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. వినియోగదారులు విద్యుత్ కార్యాలయానికి ఫోన్ చేస్తే 'చిన్న చిన్న అంతరాయాలే.. 20 నిమిషాల్లో సరఫరా వస్తుంది..' అంటూ సిబ్బంది చెబుతున్నారు. కానీ.. పునరుద్ధరించడానికి గంటల తరబడి సమయం తీసుకుంటుండడం వినియోగదారులను అసహనానికి గురి చేస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కిందిస్థాయి సిబ్బంది నిర్వహణ గాలికి వదిలేయడంతో వ్యవస్థ గాడి తప్పింది.

మొక్కుబడిగా ఛానల్ మరమ్మతు పనులు



ఛానల్‌ను పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

పెదకాకాని: నిత్యం లక్షల మందికి మంచినీరు, పంట పొలాలకు సాగునీరు అందించే గుంటూరు ఛానల్(కొత్త కాలువ)లో గుర్రపు డెక్క తొలగింపు, కాలువ గట్ల మరమ్మతుల పనులు అసంపూర్తిగా జరుగుతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజి అన్నారు. రైతులతో కలిసి పెదకాకాని శివారులోని గోళ్లమూడి రోడ్డులో గల గుంటూరు ఛానల్‌ను ఆయన రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ.. కాలువలో తూడికాడ తొలగింపునకు గడ్డి నివారణ మందు పిచికారీ చేయడంతో ఛానల్‌లో నీరు విషపూరితంగా మారిందన్నారు. గుర్రపుడెక్క, తూటికాడ నీటిలో కుళ్లిన తరువాత మొక్కుబడిగా ప్రొక్లెయిన్ సాయంతో తొలగింపు చర్యలు చేపట్టారన్నారు. పనులు పూర్తి అయిన ప్రదేశంలో ఇంకా కుప్పలు కుప్పలుగా కుళ్లిన తూటికాడ కాలువలో మిగిలిపోయిందన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు సంకూరి నీలాంబరం, రైతులు వి.వీరాంజనేయులు, డి.వినోద్ బాబు, డి.భవానిశంకర్, జి.నాగరాజు, ఎస్ గోపి, డి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య సేవలను వినియోగించుకోవాలి



వైద్యశిబిరంలో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

పెదకాకాని: ఉచిత ఆయుర్వేద వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణి అన్నారు. మండలంలోని వెనిగండ్ల బొడ్డురాయి సెంటర్‌లో ఆదివారం శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచి వేల్పుల శ్రావణి మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్యం చాలా పురాతన కాలం నుండి మంచి ప్రాచుర్యం పొందిందన్నారు. ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్య నిపుణులు, చైర్మన్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆయుర్వేద పంచకర్మ వైద్యం కోసం కేరళ వెళ్లాల్సిన అవసరం లేకుండా అగతవరప్పాడు సమీపంలో అన్ని సౌకర్యాలతో 100 పడకల ఆసుపత్రి స్థాపించామన్నారు. శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కొండ మడుగుల శ్రీనివాసరెడ్డి, వేల్పుల నాగరాజు, మాకిరెడ్డి వెంకటరెడ్డి, వైద్య బృందం డాక్టర్ మోనిక, డాక్టర్ రాహుల్ చంద్ర, డాక్టర్ భావన, మేనేజర్ మల్లేశ్వరి, థెరపిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపికి పెరిగిన ప్రాధాన్యం



మాట్లాడుతున్న సీనియర్ ఫిజియోథెరపిస్ట్ లక్ష్మీ లావణ్య

లక్ష్మీపురం: ఫిజియోథెరపి ఒక శారీరక చికిత్స మాత్రమేనని, ఇందులో ఎలాంటి మందుల ప్రమేయం ఉండదని సీనియర్ ఫిజియోథెరపిస్ట్ లక్ష్మీ లావణ్య అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాడీ వ్యవస్థ లోపాలు, కండరాల లోపాలు, శ్వాసకోశ రుగ్మతలు, గుండె సంబంధిత వ్యాధి తదితర సమస్యలు ఉన్నప్పుడు ఫిజియోథెరపి బాగా ఉపకరిస్తుందన్నారు. భౌతిక వ్యాయామం, పరికరాలతో చికిత్స, హైడ్రోథెరపీ, డ్రై నీడ్ లింగ్ తదితర విధానాల ద్వారా ఫిజియోథెరపి చికిత్స అందించవచ్చన్నారు. కాళ్లు, చేతులు చచ్చుబడటం, మూతి వంకర పోవటం, మాట్లాడలేకపోవటం, కళ్లు తెరవలేకపోవటం వంటి లోపాలన్నీ ఫిజియోథెరపి ద్వారా నయం చేయవచ్చన్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ లావణ్య చిరో ప్రాక్టిక్ సర్దుబాటు, కైరో ప్రాక్టిక్ చికిత్సలను అద్భుతంగా అందిస్తూ అన్ని రకాల నొప్పుల నుండి విముక్తి కలిగిస్తూ అందరి అభిమానం పొందుతున్నారన్నారు. అందులో శాస్త్రీయంగా శిక్షణ పొందారన్నారు. ఆరోగ్య సభలో డాక్టర్ లావణ్యని సంస్థ సభ్యులు సత్కరించారు. ఈ సభలో అనివేమా ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి, యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్, డాక్టర్ రవీంద్ర కుమార్ ప్రసంగించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ రవీంద్ర

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని నగర మేయర్ కోవేలమూడి రవీంద్ర తెలిపారు. ఆదివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 42వ డివిజన్లో రూ.53 లక్షలతో నవభారత్ నగర్‌లో సిమెంట్ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రజావసరాల దృష్టిలో పెట్టుకొని స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి పలు అభివృద్ధి పనులు చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. వార్డుల వారీగా మౌలిక వసతుల కల్పనలో స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గుంటూరు నగరంతో పాటు నగరంలో విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు పార్టీలకతీతంగా ప్రాధాన్య క్రమంలో నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ ప్రసాద్, ఈరంటి వరప్రసాద్ పాల్గొన్నారు.

బాల మురళీకృష్ణకు ఘన నివాళి

లక్ష్మీపురం: కర్నాటక సంగీత ప్రపంచంలో మహోన్నతుడు, మధురగాన సరస్వతి అపర త్యాగరాజు డాక్టర్ మంగళంపల్లి మురళీకృష్ణ అని విద్యావేత్త, గాయకుడు ఎ.పోతురాజు అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థలో సంస్థ మనమూ పాడుదాం రండి, బృందం ఆదివారం ప్రముఖ సంగీత విద్వాంసుడు బాల మురళీకృష్ణ జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ఎనిమిది దశాబ్దాల పాటు సంగీత ప్రపంచంలో తనదైన శైలిలో ఉర్రూతలూగించిన విశిష్ట వాగ్గేయకారుడు మంగళం పల్లి అన్నారు. సంగీత విద్వాంసురాలు యార్లగడ్డ లక్ష్మి, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడారు.

క్లబ్‌ల సేవా కార్యక్రమాలు విస్తృతం



నగరంపాలెం: వాసవి క్లబ్ తరుపున సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని వాసవి క్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ అన్నారు. వాసవి క్లబ్ గుంటూరు, మహిళా గుంటూరు, యువ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఆర్.అగ్రహారం గీతా మందిరంలో 108 మంది వృద్ధులకు ఉచిత బియ్యం, పెన్నులు పంపిణీ చేశారు. వాసవి క్లబ్ ఫండ్ రైజింగ్ కమిటి చైర్మన్ పాదర్తి దుర్గారావు మాట్లాడుతూ క్లబ్‌లు నిరంతరం ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాయని అన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కమిటి చైర్మన్ కొల్లిపర దుర్గానాగమణి, క్లబ్ ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి చంద్రశేఖరరావు, కోశాధికారి వేమూరి ప్రదీప్‌కుమార్, మున్నలూరి గౌరీశంకర్, కొర్లి వెంకటేశ్వరరావు, గుండా హరిప్రసాద్ అమరా రమేష్, దివ్వెల కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మంగళగిరి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెను ప్రారంభించారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ఆదివారం సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సమ్మెలోకి కార్మికులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచి చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సమ్మె కాలపు ఒప్పందాలను జీవోలు జారీ చేయాలని అన్నారు. సమ్మెకు మద్దతుగా ఎయిమ్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.శ్రీనివాసరావు, కె.బుజ్జి పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఎం.బాలాజీ, వీవీ జవహర్‌లాల్, పల్లె కృష్ణ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, కె.సాంబశివరావు, ఎస్.నాగరాజు, పి.రాము, కేదారనాద్ తదితరులు పాల్గొన్నారు.

స్టాంపింగ్ ధరలు పెంపుపై అవగాహన



నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తూనికలు, కొలతలు శాఖ(లీగల్ మెట్రాలజీ) ఆధ్వర్యంలో పరికాల స్టాంపింగ్ రేట్లు పెంచడం జరిగిందని, దీనిపై అవగాహన కలిగి ఉండాలని ఆ శాఖ డెప్యూటీ కంట్రోలర్ బి.వెంకట హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఆ శాఖ కార్యాలయంలో కాటాలు, వెయింగ్ మిషన్ల రిపేరర్లు, మ్యానుఫ్యాక్చరర్లు, డీలర్లుతో ఫీజులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పెరిగిన ఫీజులకు అనుగుణంగా వ్యాపారస్తులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్.అల్లూరయ్య, ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాజు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ఆషాఢం సారె



సారెను తీసుకు వెళుతున్న మహిళలు



విశేష అలంకరణలో అద్దంకమ్మ తల్లి

ఆషాఢం సందర్భంగా అమ్మవార్లకు సారె సమర్పణలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గ్రామ దేవతలుగా ఆరాధించే దేవతామూర్తులకు సారె సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. వట్టిచెరుకూరులో ఆదివారం గ్రామ దేవతలైన అద్దంకమ్మ తల్లి, పోలేరమ్మ తల్లికి భక్తులు సారె సమర్పించారు. మహిళలు అమ్మవార్లకు చీర, గాజులు సమర్పించారు. గ్రామంలోని భక్తులు ఉపవాస దీక్షలతో గ్రామంలోని పోతురాజు బొమ్మల దగ్గర నుంచి సారెతో బయలుదేరి గ్రామ దేవతలు కొలువుదీరిన క్షేత్రాలకు తరలివెళ్లారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పసుపు, కుంకుమలతో కూడిన సారెను అమ్మకు సమర్పించారు.

– ప్రత్తిపాడు

ఆర్టీసీ డిపోలో పార్కింగ్ అవస్థలు

ఎండా.. వానలోనూ ద్విచక్రవాహనాలు



పార్కింగ్ ప్రదేశంలో వర్షపు నీటిలో ఉన్న వాహనాలు

పొన్నూరు: పొన్నూరు ఆర్టీసీ డిపో అభివృద్ధి బాట పడుతున్నా.. ప్రయాణికులకు సరైన సౌకర్యాలు కల్పించడంలో వెనుకబడి ఉంది. బస్ డిపోలోని పార్కింగ్ స్థలానికి ఆదరణ లేకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. డిపోలో పార్కింగ్ ప్రదేశం అభివృద్ధి చెందకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తమ ద్విచక్ర వాహనాలను డిపోలోని పార్కింగ్ స్థలంలో నిలిపి వెళ్తున్నారు. నిర్ణయించిన రుసుము చెల్లిస్తున్నా వాహనాల భద్రత చేపట్టడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వాహనాలు ఎండలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిసే సమయంలో పార్కింగ్ స్థలం చెరువుగా మారుతుంది. ఉన్నతాధికారులు స్పందించి పార్కింగ్ ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నీడనిచ్చు చెట్లకు గొడ్డలి దెబ్బ!





వృక్షో రక్షతి రక్షితః.. చెట్లను మనం కాపాడితే, అవి మనల్ని కాపాడుతాయని మన పెద్దల వాక్కు. కానీ కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పెద్ద పెద్ద వృక్షాలను కూకటి వేళ్లతో సహా పెకలించి వేస్తున్నారు. గుంటూరు పర్చూరు మార్గంలోని పాతమద్రాసు రోడ్డు వెంబడి ఉన్న పెద్ద పెద్ద చింత చెట్లు ఒక్కొక్కటిగా నేలవాలుతున్నాయి. గతంలో దారిపొడవునా పచ్చని తోరణంలా కనిపించే ఈ చెట్లును చాలా వరకు నరికేశారు. తాజాగా మరికొన్ని చెట్లును కూడా వేళ్లతో సహా ఇలా నరికేస్తుండటం విమర్శలకు దారితీస్తోంది.

– ప్రత్తిపాడు

అలరించిన హిందీ సినీ గీతాలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

నగరంపాలెం: స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం సాయంత్రం ఏషామ్ మస్తాని –16 నిర్వహించారు. ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్, గీతాంజలి ఆర్కెస్ట్రా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని అతిథులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. గాయనీ గాయకులు అమ్మ పండు, పూజ, శరణ్య, నందిని, హేమమాలిని, సింహ, కళ్యాణ్, విజయ్‌సాయి, శ్రీనివాసరావు, ఆచార్య వీర రాఘవలు అనాటి హిందీ సినీ గీతాలను ఆలపించారు. పాడుతా తీయగా ఫేమ్ శ్రీలలిత 'శివ శంకరి' అనే గీతాన్ని ఆలపించగా, ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

కోట మృతి చలనచిత్ర పరిశ్రమకు తీరనిలోటు

నగరంపాలెం: ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు హఠాన్మరణం తెలుగు చలనచిత్ర సీమకు తీరని లోటు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వర రాగ సుధా ఆధ్వర్యంలో ఆదివారం అరండల్‌పేట 4/1వ అడ్డరోడ్డులోని కార్యాలయ ఆవరణలో సినీ నటుడు కోట శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కె.వి.సాయిబాబాశర్మ, పాండురంగారావు, ఆర్‌పీఎల్ నరసింహారావు, సత్యనారాయణ, తూటిపల్లి శ్రీనివాసరావు, అభిమానులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. సినీనటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు మృతి అభిమానులను దిగ్భ్రాంతికి గురి చేసిందని పలువురు పేర్కొన్నారు. 2012లో కళాదర్బార్ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన వేడుకల్లో కోట శ్రీనివాసరావుకు జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించినట్లు అధ్యక్షుడు పాత్తూరి రంగారావు గుర్తుచేసుకున్నారు. గొప్ప నటుడు అని, ఆయన లోటు ఎవరూ తీర్చలేరని ఆయన సంతాపం వ్యక్తం చేశారు.